కాళోజీకి ఘన నివాళి

కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్

ఖలీల్‌వాడి, నవంబర్ 13 : జిల్లాలో తెలంగాణ ప్రజా కవి, పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు వర్ధంతి బుధవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్‌లో ఉన్న కాళోజీ విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ శంకర్, రంగు సీతారాం, కృష్ణ పాల్గొన్నారు.

సత్యశోధక్ పాఠశాలలో ..

సిరికొండ/ మోర్తాడ్, నవంబర్ 13 : మండల కేంద్రంలోని సత్య శోధక్ పాఠశాలలో కాళోజీ నారాయణ వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు కాళోజీ స్ఫూర్తితో సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. మోర్తాడ్‌లో తెలంగాణ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో కాళోజీ వర్ధంతిని నిర్వహించారు.

జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

వినాయక్‌నగర్, నవంబర్ 13: నిజామాబాద్ జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి పెద్దపల్లి-రాఘవాపూర్ వద్ద ఓ గూడ్స్ ట్రైన్ పట్టాలు తప్పిందని పేర్కొన్నారు. దీంతో రైల్వే శాఖ నిజామాబాద్ -కాచిగూడ, గుంతకల్, బోధన్,కరీంనగర్-బోధన్ మధ్య నడిపే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు పూర్తయిన అనంతరం మళ్లీ యథావిధిగా రైళ్లు నడుస్తాయని తెలిపారు.

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి

కంఠేశ్వర్, నవంబర్ 13 : జిల్లాకు గురువారం ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రానున్నారు. ఉదయం జిల్లాకు చేరుకుని డిచ్‌పల్లి ,ఆర్మూర్, ఎడపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం కలక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్‌తో సహా ఇతర అధికారులతో నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు.

పాఠశాలల తనిఖీ

సిరికొండ, నవంబర్ 13 : మండలంలోని ఆదర్శ, గిరిజన ఆశ్ర మ పాఠశాలలు, వసతిగృహాలను తహసీల్దార్ రవీందర్‌రావు బుధవారం తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వసతిగృహాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. విద్యారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు.

నేడు అయ్యప్ప- సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవం

కోటగిరి(పోతంగల్), నవంబర్ 13 : కోటగిరిలో శ్రీ అయ్యప్ప-సాయి బాబా ఆలయ ప్రారంభోత్సవం నేడు నిర్వహించనున్నారు. ఇందు కోసం నిర్వాహకులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 18 వరకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోల విఠల్..దాతల సహకారంతో సుమారు 3 కోట్లు రూ.సేకరించి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. 2010లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా..పోల విఠల్ 1.09 గుంటల తన సొంత భూమిని వితరణ చేశారు. అయ్యప్ప విగ్రహానికి ఎత్తొండకు చెందిన ఆర్.వి.ప్రసాద్ (రాజ గురుస్వామి), సాయిబాబా విగ్రహానికి కోటగిరికి చెందిన పల్లెంపాటి శివ కృష్ణయ్య, ఉత్సవ విగ్రహాలను నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అజార్ కిషన్‌రావు దాతలుగా నిలిచారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

వినాయక్‌నగర్, నవంబర్ 13: ఈ నెల 17,18వ తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలో 66 పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 100 మీటర్ల వరకు పరీక్షలు రాసేందుకు వచ్చే అభ్యర్థులకు తప్ప ఇతరులకు ఎలాంటి అనుమతులు లేవని పేర్కొన్నారు. రెండు రోజులపాటు అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని సూచించారు. నిబంధనలు సక్రమంగా అమలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏసీపీలు, సీఐలు, ఎస్సైలను ఆదేశించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు నమోదు

ఒకరికి మూడు రోజుల జైలు

వినాయక్‌నగర్,నవంబర్13: జిల్లా కేంద్రంలో సోమవారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన వారికి బుధవారం ట్రాఫిక్ సీఐ వీరయ్య కౌన్సిలింగ్ నిర్వహించి,అనంతరం వారిని కోర్టులో హాజరుపర్చారు. మార్నింగ్ కోర్టు మేజిస్ట్రేట్ అహ్మద్ మొహియుద్దీన్ ముగ్గురికి రూ.8వేల జరిమానా విధించగా.. స్థానిక బ్యాంక్ కాలనీకి చెందిన ఏ.మల్లేశ్ అనే వ్యక్తికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తు తీర్పు వెలువరించారు.

హామీలను అమలు చేయాలి

ఖలీల్‌వాడి, నవంబర్ 13 : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలును అటకెక్కించారనిపేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్ ఆర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఎన్ఎస్ఎఫ్ (బోధన్), ఎన్సీఎస్ఎఫ్ (సారంగాపూర్)ను తెరిపించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ సైతం పరిశీలించి తన నివేదికను ప్రభుత్వానికి అందించిందని తెలిపారు.అయినాఫ్యాక్టరీలను తెరిపించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని విమర్శించారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ నాయకులు దేవారెడ్డి, పర్వయ్య, దేవన్న పాల్గొన్నారు.

దేశంలో 'ఆన్‌లైన్ బెట్టింగ్' సమస్యగా మారింది

ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆకుల విశాల్

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విశాల్

ఖలీల్‌వాడి, నవంబర్ 13: దేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ఒక తీవ్రమైన సమస్యగా మారిందని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆకుల విశాల్ అన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర బ్రాంచ్ వార్షిక సదస్సును ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గాస్ట్రోంటరాలజి (ఏఐజీ) దవాఖానలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రముఖ డాక్టర్ ఆకుల విశాల్ హాజరై మాట్లాడారు. వివిధ వయస్సులవారు ఆన్‌లైన్ బెట్టింగ్ బారిన పడుతున్నారని అన్నారు. జూద వ్యసనాలకు బలైపోతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ కారణంగా ఏర్పడే లక్షణాలు, వ్యసనానికి కారణాలను వివరించారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ అంకిత్

కోటగిరిలో సర్వే వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అంకిత్

రుద్రూర్/పోతంగల్(కోటగిరి), నవంబర్ 13 : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. బుధవారం రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్‌తోపాటు కోటగిరిలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. సర్వేలో వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. సర్వేలో కుటుంబ వివరాల సేకరణలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్లు తారాబాయి, గంగాధర్, ఎంపీడీవోలు సురేశ్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, సులేమాన్ నగర్ మాజీ సర్పంచ్ షేక్ ఖాదర్, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

సర్వేను పరిశీలించిన డీపీవో

ధర్పల్లి, నవంబర్ 13 : మండల కేంద్రంలో కొనసాగుతున్న కుల గణన సర్వేను ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. పలు ఇండ్ల వద్దకు వెళ్లి ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేయాలని వారికి సూచించారు. డీపీవో వెంట ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి, ఏపీఎం సునీత, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

సర్వేకు సహకరించాలి

మండలంలో కొనసాగుతున్న కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో బాలకృష్ణ కోరారు. బుధవారం ఆయన మండలంలోని ఇందిరానగర్ తండా, మోబిన్‌సాబ్ తండా, బెల్యాతండా, మరియతండా తదితర గ్రామాల్లో పర్యటించి సర్వేను పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

'కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ'

ఇందల్వాయి, నవంబర్ 13 : కాంగ్రెస్ రైతుల వ్యతిరేక పార్టీ అని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. , రైతులను మోసం చేస్తున్నదని, ఏడాది కాలంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక తుంగలో తొక్కిందని మండిపడ్డారు. బుధవారం ఆయన మండలంలోని గన్నారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు పూర్తిస్థాయిల్లో కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంలేదన్నారు. రైతుల వద్ద రెండు కిలోల కడ్తా తీస్తున్నారని అన్నారు. ఏడాదిన్నర పాలన పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకపోతున్నారన్నారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

దళారులను నమ్మొద్దు

సబ్ రిజిస్ట్రార్ శ్రీరామరాజు

ఖలీల్‌వాడి, నవంబర్ 13 : రిజిస్ట్రేషన్ కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎలాంటి సందేహాలున్నా సబ్ రిజిస్ట్రార్‌ను , కార్యాలయ సిబ్బందిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామ రాజు సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళారులని నమ్మి మోసపోవద్దని సూచించారు. మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే సబ్‌రిజిస్ట్రార్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి నిషేధం ఉండగా దస్తావేజు లేఖరులు వచ్చి సబ్‌రిజిస్ట్రార్‌తో వాగ్వివాదానికి దిగడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విద్యార్థినులు

రాష్ట్రస్థాయి క్రీడల్లో ఇందల్వాయి బాలికల ప్రతిభ

ఇందల్వాయి, నవంబర్ 13 : రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఇందల్వాయిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్(ఈఎంఆర్ఎస్) విద్యార్థినులు విజేతలుగా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్‌కుమార్ బుధవారం తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో ఈనెల 7, 8, 9వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా.. వివిధ విభాగాల్లో ఇందల్వాయి విద్యార్థినులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లే పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి, నవంబర్ 13 : బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై మెయిన్ గేట్ ఎదుట ఏబీవీపీ కార్యకర్తలు ధర్నా చేస్తూ గేటుపైకి ఎక్కి లోపలికి వెళ్లే క్రమంలో ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది విచక్షణ రహితంగా దాడిచేశారని ఏబీవీపీ టీయూ శాఖ అధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు. ఈ దాడిలో సాయికుమార్ అనే కార్యకర్త తలపై ఇనుపరాడ్‌తో బలంగా దాడి చేయడంతో తల పగిలి మెదడులో రక్తస్రావమై జిల్లా దవాఖానలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని పేర్కొన్నారు. ఎనిమిది మంది కార్యకర్తలు తీవ్రంగా గాయాల పాలై చికిత్స పొందుతున్నారని తెలిపారు. బుధవారం ఆయన టీయూలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల ఆత్మహత్యలకు, ఏబీవీపీ కార్యకర్తలపై దాడులకు కారణమైన సీఎస్‌వో రాకేశ్‌తోపాటు సెక్యూరిటీ ఏజెన్సీని వెంటనే విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

- **డిగ్రీ టైంటేబుల్ సవరణ :** డిచ్‌పల్లి, నవంబర్ 13 : టీయూ పరిధిలోని సవరణతో డిగ్రీ పరీక్ష టైంటేబుల్ విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఎం. అరుణ తెలిపారు. సీబీసీఎస్, బీకాం, బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ 1వ, 3వ, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2వ, 4వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు 24 నుంచి (2020 నుంచి 2023 విద్యార్థులకు) ఉండగా.. సవరిస్తూ 26 వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య అరుణ తెలిపారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు.
- **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ :** జక్రాన్‌పల్లి, నవంబర్ 13 : మండలంలోని తొర్లికొండలో గ్రామంలో బాధితులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం అందజేశారు.కార్యక్రమంలో ఆర్మూర్ ఏఎంసీ డైరెక్టర్ కనక రవి, కాంగ్రెస్ పార్టీ జక్రాన్‌పల్లి మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.
- **మత మార్పిడి అడ్డగింత:** రుద్రూర్, నవంబర్13: మండల కేంద్రంలోని అంబంగల్లీలో మత మార్పిడి చేసుకుంటున్న ఓ కుటుంబాన్ని హిందూ సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అమాయకులు, నిరుపేదలను లక్ష్యంగా చేసుకొని ఆర్థికంగా ఆశచూపి, రోగాలు నయమవుతాయని చెప్పి మత మార్పిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మత మార్పిడి సరికాదని నచ్చజెప్పారు.

ముగిసిన బాలోత్సవం

ఖలీల్‌వాడి, (మోపాల్) నవంబర్ 13: జిల్లాకేంద్రంలోని మోపాల్ ప్రెసిడెన్సి పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక , ఆల్ పెన్షనర్ మల్లు స్వరాజ్యం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలోత్సవం ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభని మరింత రెట్టింపు చేసింది బాలోత్సవమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేయగా..సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య

వినాయక్‌నగర్, నవంబర్ 13: జిల్లా కేంద్రంలో మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు నాల్గోటౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన వీర్నాక్ష శివలింగ(37) వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తరచూ మద్యం తాగి భార్య రుక్మిణిని వేధింపులకు గురిచేసేవాడు . బుధవారం మద్యం మత్తులో భార్యను కొట్టాడు. వీరి కూతురు అపర్ణ తలతిప్పి పడిపోయిందని బోర్గాం(పీ)పాఠశాల నుంచి సమాచారం రావడంతో వెంటనే రుక్మిణి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి భర్త శివలింగ ఇంట్లో పైకప్పు ఇనుపరాడుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ విజేత జిల్లా బాలికల జట్టు

జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి బాలికల హాకీ టోర్నీ విజేతగా నిజామాబాద్ జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ లో 2-0 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది.

-కంఠేశ్వర్, నవంబర్ 13

18లోపు సమగ్ర కుటుంబ సర్వే పూర్తిచేయాలి

అధికారులతో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

మోర్తాడ్, నవంబర్ 13: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఈనెల 18వ తేదీలోపు పూర్తిచేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. కమ్మర్‌పల్లిలో బుధవారం సర్వే సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. సర్వేను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. కమ్మర్‌పల్లిలో నిర్మిస్తున్న సామూహిక మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామాల్లో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఏపీఎం కుంట గంగాధర్, ఏపీవో విద్యానంద్ పాల్గొన్నారు.

సర్వే తనిఖీ..

ఏర్గట్ల/ భీమ్‌గల్, నవంబర్ 13: మండల కేంద్రం ఏర్గట్లలో నిర్వహిస్తున్న సర్వేను అర్మూర్ అర్డీవో రాజాగౌడ్, బట్టాపూర్ గ్రామంలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో శివకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్, అర్ఐ సదానంద్ తదితరులు ఉన్నారు. భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్, సుదర్శన్‌నగర్, సంతోషనగర్ తండాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీవో సంతోష్‌కుమార్ పరిశీలించారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

ముప్కాల్, నవంబర్ 13: ఎస్సెస్సీలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్డీవో రాజాగౌడ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన మండల ప్రత్యేకాధికారిణి స్రవంతితో కలిసి ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పలు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో గౌస్ మొహీనుద్దీన్, ఎంఈవో జక్కుల రవికుమార్, హెచ్ఎం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల 'పొలంబాట'

నవీపేట, నవంబర్ 13: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం పొలంబాట నిర్వహించారు. ట్రాన్స్‌కో టెక్నికల్ ఆఫీసర్ రమేశ్ హాజరై మాట్లాడుతూ.. విద్యుత్ వాడకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏడీఏ ప్రశాంత్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్లు అరుణ్, నాగరాజు, బినోలా సొసైటీ చైర్మన్ మగ్గిరి హన్మాండ్లు, మాజీ సర్పంచ్, ఉప సర్పంచులు ద్యాగ సరిన్, బాగాజీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దచెరువు కబ్జా పరిశీలన

మాక్లూర్, నవంబర్ 13: మండలంలోని మాదాపూర్ గ్రామ పెద్ద చెరువును ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. వీడీసీ, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చెరువు కబ్జాపై ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈ దివ్యభారతి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారం రోజుల అనంతరం హద్దులు గుర్తించి కందకాలు తవ్విస్తామన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన

తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది. మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను ''ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: **25 నవంబర్, 2024న మ॥ 12.30 గం. నుండి మ॥ 3.30 గం. మధ్య** (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది. **రుణగ్రహీతలు మరియు బకాయి మొత్తం వివరాలు:**

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నెం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	ఆర్మూర్ NIZA TG	xxxxxxxxxxxx6520	మహమ్మద్ ముజాహిద్	136905	24-సెప్టెంబర్-24	32.5	28.8
2	ఆర్మూర్ NIZA TG	xxxxxxxxxxxx4978	యరవత్రి గణిత	116053	24-సెప్టెంబర్-24	26.3	20.7
3	బోధన్ C0971 TG	xxxxxxxxxxxx2129	మహమ్మద్ ముద్దసీర్ అహ్మద్	65338	30-జూలై-24	19	15.5
4	నిజామాబాద్	xxxxxxxxxxxx5187	బంటు రవళి	89906	26-ఆగస్టు-24	19.3	18.2
5	కామారెడ్డి	xxxxxxxxxxxx5174	గోకని రవీందర్ గౌడ్	237917	25-అక్టోబర్-24	52.9	48.5
6	ఆదిలాబాద్	xxxxxxxxxxxx1738	సోమా లక్ష్మి	47843	24-సెప్టెంబర్-24	9.99	9.79
7	నిర్మల్ TG	xxxxxxxxxxxx5640	సల్లంగుల సుమంత్	105439	01-అక్టోబర్-24	27	25
8	బోధన్ C0971 TG	xxxxxxxxxxxx7334	మూడ్ బాలసంగ్రం	150680	07-జూన్-24	25.5	24.7
9	బోధన్ C0971 TG	xxxxxxxxxxxx0620	సింగారపు రోహిత్ గుప్త	501553	25-అక్టోబర్-24	108.4	100.57

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో **మ॥ 12.30 గం. నుండి మ॥ 3.30 గం.** మధ్య నిర్వహించబడును. సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.

అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్.

17న మతోన్మాద వ్యతిరేక సదస్సు

వివరాలను వెల్లడిస్తున్న సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు

ఆర్మూర్‌టౌన్, నవంబర్13: కమ్యూనిస్ట్ పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 17న నిజామాబాద్‌లో మతోన్మాద వ్యతిరేక సదస్సును నిర్వహించనున్నట్లు న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు తెలిపారు. పట్టణంలోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేండ్లలో మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. మతం పేరుతో రాజకీయం చేయడం తగదన్నారు. 17న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు.